క్లుప్తంగా

మెరుగైన వైద్యసేవలు అందించాలి



రేగళ్లు పీహెచ్‌సీ వద్ద అధికారులు, వైద్య సిబ్బంది

పీలేరురూరల్ : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి కృష్ణకిషోర్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని రేగళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, కాన్పుల గది, మరుగుదొడ్లు, మందులు ఇచ్చేగది, రక్తపరీక్షల గదిని పరిశీలించారు. ఆస్పత్రి పని తీరు గూర్చి, ఓపీ వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రాధామాధవి, డిప్యూటీ హెఈవో కృష్ణమ్మ, పర్యవేక్షకులు చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



సిబ్బంది పని తీరుపై ప్రజలను అడుగుతున్న తహసీల్దార్

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ శ్రీరాములు నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల కొరత, రోజువారి ఓపీల వివరాలపై డాక్టర్ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ సిబ్బంది పని తీరును ఆసుపత్రికి వచ్చే రోగులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

కుళ్లిన కోడిగుడ్లపై విచారణ



మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యమ్మ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట అంగన్‌వాడీ–1 కేంద్రంలో కుళ్లిపోయిన కోడిగుడ్లు ఇస్తున్నారని ఎంపీటీసీ రవి బుధవారం జరిగిన మండల సమావేశంలో సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయం పత్రికల్లో కూడా ప్రచురితం కావడంతో బి.కొత్తకోట ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యమ్మ, సూపర్‌వైజర్ భవాని సదరు కేంద్రాన్ని తనిఖీ చేసి కుళ్లిన కోడిగుడ్లను పరిశీలించారు. వాటి స్థానంలో వేరే గుడ్లను ఎంపీటీసీ సమక్షంలో పిల్లల తల్లిదండ్రులకు పంపిణీ చేసినట్లు సీడీపీఓ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు తక్కువ పరిమాణంలో వచ్చినా, కుళ్లిన గుడ్లు వచ్చినా తక్షణం వెనక్కి పంపేయాలని అంగన్‌వాడీ కార్యకర్తను ఆదేశించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు మొండిచేయి



పి. రెడ్డప్పరెడ్డి

మదనపల్లె సిటీ: ప్రభుత్వ ఉద్యోగులకు రెగ్యులర్‌గా ఇవ్వాల్సిన డీఏ, ఐఆర్ ఇవ్వకుండా మొండిచేయి చూపిందని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.రెడ్డప్పరెడ్డి తెలిపారు. గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ ప్రస్తావనే తీసుకురాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి ఆశలు కల్పించిందన్నారు. ఏడాది కావస్తున్న డీఏ, ఐఆర్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళి

తంబళ్లపల్లె: స్థానిక గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి జిలానీభాషా ఘనంగా నివాళులు అర్పించారు. సమాజంలో ప్రతి ఒక్కరికి విజ్ఞానాన్ని అందించేందుకు గ్రంథాలయాలే విజ్ఞాన భాండగారాలని వాటి మెట్ట మొదట ఏర్పాటు చేసిన వెంకటరమణయ్య గొప్ప వ్యక్తని కొనియాడారు. ఆయన ఆశయాలను అనుగుణంగా గ్రంథాలయాలను మరింత అభివృద్ధికి సహరిస్తూ విజ్ఞానాన్ని పెంపొదించుకోవాలన్నారు. పాఠకులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ

ములకలచెరువు: గంబూషియా చేపలతో దోమల నివారణ అరికట్టవచ్చని మండల మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని ములకలచెరువు, బురకాయలకోట సమీపంలో దోమలు అభివృద్ధి చెందకుండా నీటి మడుగుల్లో గంబూషియా చేపలను వదిలారు. ఈ చేపలు నీటిలో ఉన్న దోమల లార్వాను తినడం ద్వారా దోమలను నివారించవచ్చు అన్నారు. ఒక్కో గంబూషియా చేప నోటి ద్వారా 300 చేపపిల్లలను విడుదల చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ప్రత్యామ్నాయమే శరణ్యం

- ముగిసిన వేరుశనగ సీజన్
- ఆరుతడి పంటల సాగుకు సన్నద్ధం
- విత్తనాల కోసం రైతుల ఎదురుచూపులు



దుక్కులు చేస్తున్న రైతులు

గుర్రంకొండ: ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో ఖరీఫ్‌లో వేరుశనగ విస్తీర్ణం తగ్గింది. నియోజకవర్గంలో ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. మరికొన్ని ప్రాంతాలు చిరుజల్లులకే పరిమితమయ్యాయి. ఎక్కడా పదును వర్షం పడలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుకు గడువు ముగిసింది. వర్షాలు అంతంత మాత్రంగా కురవడంతో నియోజకవర్గంలో 24 శాతం మేరకు వేరుశనగను సాగుచేశారు. సీజన్ ముగియడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో 6,054 హెక్టార్ల విస్తీర్ణంలో ఆరుతడి పంటల సాగుకు సన్నాహాలు చేసుకొంటున్నారు. ఇందుకోసం రైతులు ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు.

24 శాతమే సాగు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఖరీఫ్ సీజన్ వేరుశనగ పంట సాగు గడవు ముగిసింది. సాధారణంగా వర్షాలు సమృద్ధిగా కురిసే జూన్, జులై, ఆగస్టు నెలల్లో మాత్రమే వేరుశనగ సాగుకు అనుకూలం. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవలేదు. దీంతో వేరుశగ సాగు సీజన్ అనుకొని విధంగా ముందుకు సాగలేదు. నియోజకవర్గంలో 24 శాతం మాత్రమే ఈ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేశారు. మిగిలిన రైతులు గడవు ముగిసిపోవడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు.

విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు

వర్షాధార పంటలైన ఉలవ, కంది, అలసంద, అనప వంటి ఆరుతడి పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే వేరుశనగ సాగు కోసం పొలాలు దక్కులు చేసుకొని సిద్ధంగా ఉన్న రైతులు.. గడువు ముగిసిపోవడంతో ప్రత్యామ్నాయం పంటల సాగు కోసం పొలాలను మరోసారి దుక్కులు చేసుకొంటున్నారు. పది రోజులుగా రైతులు పొలాలను దుక్కులు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఆరుతడి పంటలను ఆగస్టు నెలాఖరు నుంచి సెప్టెంబర్ 30 వరకు సాగు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. సకాలంలో వర్షాలు కురిస్తే ఆరుతడి పంటలు సాగు చేసుకోవచ్చని రైతులు అంటున్నారు. కందులు, ఉద్దులు పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇప్పటికే ఎంతమేరకు విత్తనాలు అవసరమో జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు.

ఏర్పాట్లు చేసుకొంటున్నాం



జూన్, జూలై నెలల్లో మాత్రమే వేరుశనగ సాగు చేసుకోవాల్సి ఉంటుంది. ఈఏడాది వర్షాలు అంతంతమాత్రంగానే కరిశాయి. పంటసాగు గడువు ముగియడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడానికి ఇదే అదను. మరోసారి పంటలను దుక్కులు చేసుకొని పంటసాగు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకొంటున్నాం. –కృష్ణవేణి, కమ్మపల్లె

విత్తనాలు పంపిణీ చేస్తాం



ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం అవసరమైన కందులు, ఉద్దుల విత్తనాలను రైతులకు రెండు రోజుల్లో పంపిణీ చేస్తున్నాము. ఇప్పటికే రైతులు పంటల సాగుకు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. రైతు సేవాకేంద్రాల్లో విత్తనాల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. – రత్నమ్మ, ఏఓ, గుర్రంకొండ

అక్రమ కేసులకు బెదిరేది లేదు

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



చెవిరెడ్డి లక్ష్మిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు బెదిరేది లేదని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులతో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ మేరకు పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం తుమ్మలగుంటలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సతీమణి చెవిరెడ్డి లక్ష్మిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమ కేసులతో కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష తీర్చుకుంటోందని, అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్నారు. అక్రమ కేసులు, అరెస్టులతో కూటమి ప్రభుత్వం సాధించిందేమీ లేదని, ప్రజలే తగిన సమయంలో కూటమిని బుద్ధిచెబుతారని హెచ్చరించారు. చెవిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

పరామర్శ

పీలేరు నియోజకవర్గానికి చెందిన పలువురు రోగులు స్విమ్స్‌లో చికిత్సలు పొందుతున్న సమాచారంతో గురువారం తిరుపతి స్విమ్స్‌కు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, షేక్ సల్మా, ఎల్. రెడ్డెప్పను పరామర్శించారు. వారి ఆరోగ్యస్థితిపై వైద్య సిబ్బందిని విచారించారు. మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని వైద్యులను కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతే రాజు



ప్రకృతి వ్యవసాయంపై వివరిస్తున్న అధికారులు

మదనపల్లె రూరల్ : ప్రకృతి వ్యవసాయ విధానాలను సక్రమంగా అమలుచేస్తే రైతే రాజు అవుతాడని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ప్రకృతి వ్యవసాయ నిపుణులు టి.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సీఎల్‌ఆర్‌సీ భవనంలో ప్రకృతి వ్యవసాయంపై మదనపల్లె, కురబలకోట, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల రైతుసేవా కేంద్రాల ఇన్‌చార్జిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మూడురోజుల పాటు జరిగే అవగాహన సదస్సులో తొలిరోజైన గురువారం ప్రకృతి వ్యవసాయ నిపుణులు రిటైర్డ్ ఐఏఎస్ విజయ్‌కుమార్ వర్చువల్ విధానంలో ప్రకృతి వ్యవసాయ విజ్ఞానం గురించి వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందులు ఉపయోగించకుండా సహజపద్ధతుల్లో చేసే వ్యవసాయమే ప్రకృతి సేద్యమని వివరించారు. రసాయన ఎరువులు వాడకంతో భూసారం తగ్గి మొక్కలు భూమిలోని పోషిక విలువలు అందుకోలేక పోతున్నాయని పేర్కొన్నారు. దీంతో సూక్ష్మ పోషకాలు లేని ఆహారం తీసుకోవడం వలన అనారోగ్య సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ వర్షపాతం, నీటి పారుదల సౌకర్యాలు లేని మెట్టభూముల్లో కూడా ఏడాదికి మూడు పంటలు పండించవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేలకు రోగనిరోధకశక్తి పెరగడంతో పాటు పంటలకు చీడపీడల బాధలు తగ్గుతాయని పేర్కొన్నారు. అనంతరం మదనపల్లె వ్యవసాయాధికారి నవీన్‌రెడ్డి మాట్లాడుతూ మూడురోజుల శిక్షణలో భాగంగా రెండోరోజు శుక్రవారం అంకిశెట్టిపల్లె వ్యవసాయ క్షేత్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కురబలకోట, రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల వ్యవసాయాధికారులు అజిత, జాఫర్, మంజుల, ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం



మాట్లాడుతున్న ఏడీఏ జీఎన్ నాగప్రసాద్

కలికిరి(వాల్మీకిపురం): పారదర్శక పాలన, సేవల కోసం సమాచార హక్కు చట్టం ఎంతగానో దోహదపడుతుందని ఏడీఏ జీఎన్ నాగప్రసాద్ తెలిపారు. వాల్మీకిపురంలో వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ జీఎన్ నాగప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన సమాచారాన్ని రైతులు సమాచార చట్టం ప్రకారం కోరవచ్చని, అధికారులు గోప్యత పాటించడానికి వీలులేదన్నారు. దరఖాస్తులో కోరిన సమాచారం ఇవ్వని అధికారులపై ఉన్నతాధికారుల వద్దకు అప్పీల్ చేయవచ్చన్నారు. ఏఓ మురళీమోహన్, ఉద్యానశాఖ అధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి, వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన

కలకడ : సమాచారహక్కు చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని మండల వ్యవసాయశాఖాధికారి ఎంఆర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం కలకడలో సమాచార హక్కుచట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకంగా జవాబుదారీతనంతో పని చేసేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందన్నారు. సమాచార చట్టం ద్వారా ఏవిధమైన సమాచారం పొందవచ్చని పేర్కొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4

తంబళ్లపల్లె: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ–4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎంపీడీఓ థామస్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పీ–4 అమలుతీరుపై సమావేశం నిర్వహించారు. పీ–4 కార్యక్రమానికి మండలంలో నిరుపేద కుటుంబాలు (బంగారు కుటుంబాలు) 1481 గుర్తించగా అందులో 141 కుటుంబాలను దత్తతకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండలంలో నిరుపేదల అభివృద్ధికి ఆర్థికంగా సహరించేందుకు దాతలు సహకరించాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ త్యాగరాజు. పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు కోసం పోస్టుకార్డు ఉద్యమం

బి.కొత్తకోట: కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ తహసీల్దార్లకు వినతిపత్రాలు, పోస్టుకార్డులు పంపి ఉద్యమంగా చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా సహాయ ప్రధాన కార్యదర్శి సలీంబాషా, కార్యనిర్వాహ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిపై కార్మికులు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. సోమవారం కార్మికులతో తహసీల్దార్ కార్యాలయాల్లో సమస్యలపై వినతిపత్రం సమర్పిస్తామని, ప్రతి కార్మికుడు పోస్ట్‌కార్డు ద్వారా సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ సీఎంకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాన్ని కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా చౌడేశ్వరీ దేవి జయంత్యుత్సవం

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు



మదనపల్లె సిటీ: ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి



కేవీపల్లె: జాండ్రపేటలో..



రామసముద్రం: గుంతలపేటలో..



కలకడ: కేక్ కట్‌చేస్తున్న తొగట వీరక్షత్రియులు



మదనపల్లె సిటీ: భక్తులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



పీలేరు : వేడుకల్లో తొగటవీర క్షత్రియులు

మదనపల్లె సిటీ: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం అమ్మవారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయంలో తొగటవీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్, కార్యదర్శి ,సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో నిసార్‌అహ్మద్

చౌడేశ్వరి అమ్మవారిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. వర్షాలు బాగా కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అలాగే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబాలకు మంచి జరగాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరంలో రక్తదాతలను అభినందించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి ,శీలం రమేష్, కౌన్సిలర్లు ఎస్.వి.రమణ, ప్రసాద్‌బాబు, శివారెడ్డి, బేబి వెల్‌కమ్ చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, నరిబాబాయ్, పూజారి చరణ్, కొత్తపల్లి మహేష్, మునిశేఖర్ పాల్గొన్నారు.

అమ్మవారికి అభిషేకం

రామసముద్రం: మండలంలోని గుంతలపేట, గుంతయంబాడి గ్రామంలో చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు చేసి అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవార్లకు నిమ్మకాయల దీపాలు వెలిగించారు. ఉపవాసాలతో మహిళలు పొంగళ్లను సమర్పించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా వేడుకలు

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని చేనేత నగర్‌లో చౌడేశ్వరి మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం చౌడేశ్వరి మాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో వర్షాలు సంవృద్ధిగా కురవాలని, సమాజం సుభిక్షంగా ఉండాలని పూజించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్త పల్లా కృష్ణయ్య, కార్యదర్శి మడక వెంకటేశ్వర్లు, భోజనపు శ్రీరాములు, గుండ్లూరు రాధాకృష్ణ, చెంగల్‌రాయులు, పోలిశెట్టి సురేంద్ర, మడక మదనమోహన్, జోక నాగరాజ, తొగట వీర క్షత్రియులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కలకడ : చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలను మండలంలోని కలకడ, కోన, గుడిబండ, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె పంచాయతీల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం అన్ని అమ్మవారి ఆలయాల్లో తొగట వీరక్షత్రియుల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి, అన్నదానం చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

కేవీపల్లె : మండలంలోని చీనేపల్లె జాండ్రపేటలో వెలసిన రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారి జయంతిని పురస్కరించుకుని అమ్మవారికి జలాభిషేకం, అభిషేకం, మహాగణపతి పూజ, నవగ్రహారాధన, చండీహోమం, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

గుర్రంకొండ: మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని జమాతే ఇస్లామీ హింద్ జిల్లాశాఖ అధ్యక్షుడు ఆజం అలీఖాన్ అన్నారు. మట్టిలో చేతులు హృదయంలో దేశం అనే నినాదంతో సీఐవో (చిల్డ్రెన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్) దేశవ్యాప్తంగా పదిలక్షల మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గురువారం మండలంలోని కంద్రిగ గ్రామంలో పిల్లలతో మొక్కలు నాటించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పిల్లల్లో ప్రకృతిపై ప్రేమను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంస్థ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు జమీలా, సభ్యులు అమీర్, సయ్యద్ హాషీం పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు టైం స్కేల్

మదనపల్లె: ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంటీఎస్, సమాన పనికి సమాన వేతనం, వీళ్లకు సంక్షేమ పథకాల వర్తింపు, 62 ఏళ్లకు పదవీ విరమణ పెంచాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాల్లోనే ఎఫ్‌సీ బాధ్యతలు కొనసాగించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్

బి.కొత్తకోట: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధ్యానత ఇవ్వాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్ అన్నారు. గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. మ్యూటేషన్లు, రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులు, ఫిర్యాదులు, సర్వే, భూ సమస్యలపై రికార్డులు పరిశీలించి వాటిలో ఎన్ని పరిష్కారం అయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకున్నారు. తర్వాత అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి.. వారి పనితీరుపై సమీక్షించి మెరుగుపర్చుకోవాల్సిన అంశాలపై సూచనలిచ్చారు. వీఆర్‌ఓ రజనీకాంత్ పోజిషన్ ధ్రువీకరణ జారీ అంశంపై తలెత్తిన అభ్యంతరాలను పట్టించుకోకుండా చర్యలు తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధ్రువీకరణ జారీ విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తహసీల్దార్ ఎ.బావాజాన్, ఆర్‌ఎస్‌డీటీ బాలాజీ, ఆర్‌ఐ వీరాంజనేయులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

మదనపల్లె సిటీ: సకాలంలో పన్నులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని ఇన్‌కమ్‌టాక్స్ అధికారి మహమ్మద్‌ఫారూఖ్ కోరారు. గురువారం స్థానిక సొసైటీకాలనీలోని విజయభారతి పాఠశాలలో ఇన్‌కమ్ టాక్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టాక్సులు కట్టడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందన్నారు. ఇన్‌కమ్‌టాక్సు ఎవరు కట్టాలి, ఎంత కట్టాలనేది ముందుగా తెలుసుకోవాలన్నారు. ఉద్యోగులు, వ్యాపారవేత్తలతో పాటు వ్యాపారులు పన్నులు విధిగా చెల్లించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన శ్లాబుల ప్రకారం చెల్లించాలన్నారు. అనంతరం ఇన్‌కమ్‌టాక్సు సకాలంలో చెల్లించిన విజయభారతి పాఠశాల ప్రిన్సిపాల్ నిశ్చలసేతుకు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌కమ్‌టాక్సు ఇన్‌స్పెక్టర్ సూర్యబాబునాయక్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్.సేతు తదితరులు పాల్గొన్నారు.